యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

- మహారాష్ట్ర నుంచి జిల్లాకు తరలింపు
- వాహనాల్లో కుక్కడంతో మృత్యువాత
- నిద్రలో నిఘా వ్యవస్థ

దళారులు పశువులను వాహనాల్లో కుక్కి హింస పెడుతూ వాటిని కబేళాలకు తరలిస్తున్న తీరు కంటతడి పెట్టిస్తోంది. శుక్రవారం చింతలమానెపల్లి మండలం నుంచి పశువులను అక్రమంగా తరలిస్తుండగా మూడు బొలెరో వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. వాటిలో తొమ్మిది పశువులు ఊపిరాడక మృతి చెందాయి.

– కౌటాల/చింతలమానెపల్లి


ఊపిరాడక మృతి చెందిన పశువులు

పశువులపై అక్రమ వ్యాపారుల కర్కశత్వం ఆగడం లేదు. దేశంలో గోమాతగా పూజించే జంతువుపై కనీసం జాలి చూపకుండా హింసకు గురి చేస్తూ వాటిని కబేళాలకు తరలిస్తున్న క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. పశువుల అక్రమ రవాణా అడ్డుకునేందుకు పోలీసులు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నా అక్రమ రవాణా జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. పశువుల తరలింపులో ఆయా జంతువుల ఆకారాలను బట్టి వాహనాలను వినియోగించాల్సి ఉంటుంది. పెయ్యదూడలు, సూడి పశువులను తరలించడం నిబంధనలకు విరుద్ధం. కానీ నిబంధనలేవీ అమలు కావడం లేదు. వ్యాపారులు అక్రమంగా పశువులను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పాపం.. పశువులు

దళారులు ఒకే వాహనంలో పదుల సంఖ్యలో పశువులను కుక్కి ఎక్కిస్తున్నారు. ఒక పెద్ద వాహనంలో ఎనిమిది పశువులు పట్టాల్సిన చోట 30 నుంచి 45 పశువులను తరలిస్తున్నారు. రెండు, మూడు పశువులు పట్టే టాటా ఏసీ, బొలెరో వాహనాల్లో 10 నుంచి 15 పశువులను ఎక్కిస్తున్నారు. చిన్నా, పెద్దా తేడా చూడకుండా అన్ని పశువులను ఒకే వాహనంలో తరలిస్తున్నారు. దీంతో తొక్కిసలాట జరిగి చిన్న జంతువుల కాళ్లు విరిగిపోవడంతో పాటు గాయాలపాలవుతున్నాయి. గాయాలైన పశువులకు ప్రథమ చికిత్స సైతం అందించే పరిస్థితి లేదు. మహారాష్ట్రతో పాటు జిల్లాలోని పశువుల సంతల్లో కొనుగోలు చేసిన పశువులను కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తుంటారు. వందల కిలో మీటర్ల మేర మేత, నీరు లేకుండా మూడు, నాలుగు రోజుల పాటు పశువులు ప్రయాణం సాగించాల్సి ఉంటు ంది.

ఆగని దందా..

జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై గుట్టు చప్పుడు కాకుండా నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాహనాల్లో తరలిస్తుండగా మృతి చెందిన పశువులను అడవి ప్రాంతాల్లో, రోడ్డు పక్కన పడేసి వదిలి వెళ్తున్నారు. పశువులను వాహనాల్లో ఎక్కించే క్రమంలో మృతి చెందిందే అక్కడే వదిలి వెళ్తున్నారు. పశువుల కబేళాలతో వచ్చే దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి మండలం గూడెం చెక్‌పోస్ట్ మీదుగా అక్రమంగా పశువులను తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు మూడు బొలెరో వాహనాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా 43 పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అందులో 9 పశువులు ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మిగితా పశువులను చింతలమానెపల్లి గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న ఆదే బాపురావు, షాయిక్ అసీం, ముక్తార్ బీగ్, నక్క శంకర్‌ల పై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిత్తడిరోడ్డుపై నడిచేదెలా?


చిత్తడిగా మారిన రోడ్డు

కెరమెరి: మండలంలోని నిషాని రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన మూడు రోజులుగా వానలు కురుస్తున్న నేపథ్యంలో మట్టి రోడ్డు బురదగా మారింది. దేవుడుపల్లి పునరావాస కేంద్రం వరకు కంకర రోడ్డు ఉన్నా ఆ తర్వాత మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వర్షపు నీరు నిలిచింది.


కోతకు గురైన రోడ్డు

క్లుప్తంగా

'కల్వర్టు నిర్మించండి'


జెండాగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె

దహెగాం: మండలంలోని కోత్మీర్ గ్రామ పంచాయతీలోని జెండాగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే ఒర్రె ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

రెబ్బెన: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బండారి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోలేటిలో ఈనెల 7న హైదరాబాద్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల స్థితిగతులపై నిర్వహించే సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం కాబోతున్నాయన్నారు. ఇప్పటికే సింగరేణి, ఎన్టీపీసీ, ఎన్టీపీ, ఎఫ్‌సీఐ, ఈసీఐఎల్, బీడీఎల్, బీహెచ్ఈఎల్ ప్రభుత్వ హాస్టల్స్, పంచాయతీ, మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు తక్కువ వేతనాలకే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగంలో ఉన్న 36 రకాల విభాగాల్లో, కేంద్ర సర్వీసుల్లో సుమారు 6లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేసే కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలన్నారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే సదస్సును కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు. గోలేటి ఏరియా అధ్యక్షుడు పోషం, కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు సోమయ్య, లచ్చన్న, లక్ష్మి, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు జలహారతి

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్నకు వరుణ దేవుడు జలహారతినిచ్చాడు. కాకతీయుల కాలంలో ఈ ఆలయం చెరువు మధ్యలో నిర్మించారు. ఏటా శ్రావణమాసం ప్రారంభంలోనే ఆలయం చుట్టూ వరద నీరు చేరుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెప్పపై ఆలయానికి చేరుకొని పూజలు చేస్తారు. రెండు రోజుల కిత్రం కురిసిన భారీ వర్షాలకు ఆలయం చుట్టూ నీరు చేరింది. దీంతో వరుణ దేవుడు మల్లన్నకు జలహారతి ఇచ్చాడని భక్తులు పేర్కొంటున్నారు.

'కుల సంఘాల అభివృద్ధికి కృషి'

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడులో గల మున్నూరు కాపు సంఘ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.25 లక్షలతో కాపుసంఘ భవనం అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు అఖిలేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ సిగ్నల్ తిప్పలు

సాత్నాల: నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ అనేది మన జీవన విధానంలో ఒక భాగంగా మారింది. 25 రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రాకపోవడంతో సైద్‌పూర్, రేణిగూడ, డొన, అర్జుని, పరస్‌వాడ్ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివాసీలకు అందుబాటులో ఉన్న ఏకైక నెట్వర్క్ బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రాకపోవడంతో ఆసుపత్రి, అత్యవసర పరిస్థితుల్లో సమాచారాన్ని అందించలేకపోతున్నారు. రైతులు వ్యవసాయ సమాచారాన్ని పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణం ప్రమాదకరం..!

- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు
- దూసుకొస్తున్న వన్యప్రాణులు
- తరుచూ రోడ్డు ప్రమాదాలు


దుప్పిని ఢీకొని రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వాహనదారుడు

సిర్పూర్(టి): రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని భూపాలపట్నం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో చింతకుంట గ్రామం నుంచి భూపాలపట్నం గ్రామం వరకు పూర్తిగా అటవీప్రాంతం ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా అటవీప్రాంతం కావడంతో వన్యప్రాణులు రోడ్డు దాటే సమయంలో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండటంతో అటవీప్రాంతం నుంచి రోడ్డుపైకి ఒక్కసారిగా వన్యప్రాణులు, ఇతర జంతువులు వస్తుండటంతో ద్విచక్ర వాహనదారులకు కానరాక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

వన్యప్రాణులను ఢీకొని..

మండలంలోని చింతకుంట –భూపాలపట్నం గ్రామాల మధ్యలో అటవీప్రాంతం గుండా ఉన్న ప్రధాన రహదారిపై వన్యప్రాణులను ఢీకొని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం భూపాలపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు భూపాలపట్నం గ్రామం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రానికి వస్తుండగా ఒక్కసారిగా దుప్పులు రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనంతో దుప్పులను ఢీకొని రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఒక వ్యక్తికి తలకు, చేతులకు తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి కాలుకు తీవ్రగాయాలై కాలు విరిగింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలని వాహనదారులు, మండలంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెట్లు తొలగించాలి



భూపాలపట్నం నుంచి చింతకుంట గ్రామం వరకు పూర్తిగా అటవీప్రాంతం, రోడ్డుకు ఇరువైపులా దట్టమైన చెట్లు ఉండటంతో రోడ్డుపైకి ఎప్పుడు ఏ జంతువులు వస్తున్నాయో తెలియడం లేదు. దీంతో ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలి. – రాజేశ్, భూపాలపట్నం

అధికారులు స్పందించాలి



రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండటంతో ప్రమాదకరంగా రోడ్డు మారింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి భూపాలపట్నం గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– వెంకటరమణ, చింతకుంట

నేడు కాగజ్‌నగర్‌లో నిమజ్జనోత్సవం


పెద్దవాగు వద్ద ఏర్పాట్లు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలో 30 వార్డులు ఉండగా, 113 మండపాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనం పకడ్బందీగా నిర్వహించేందుకు మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ శాఖల అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఎప్పటికప్పుడు ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు 8 మంది సీఐలు, 17 మంది ఎస్సైలు, 189 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు.

ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పట్టణంలోని అన్ని వార్డుల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాం. పెద్దవాగు సమీపంలో 25 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. నిమజ్జనానికి వచ్చిన వారిని మైసమ్మ గుడి సమీపంలోనే నిలిపివేస్తాం. కమిటీ సభ్యులు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుంది.

– ప్రేమ్‌కుమార్, కాగజ్‌నగర్ సీఐ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


రెబ్బెన: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎన్టీఆర్ కాలనీవాసులు


ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రెబ్బెన: ఉపాధ్యాయ దినో త్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో కాలనీవాసులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు లావణ్య, సాయికుమార్‌తో పాటు సీఆర్‌టీ దేవేందర్‌లను శాలువాతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. మోడెం సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆవిడపు గోపి, అన్నపూర్ణ మురళీగౌడ్, రమేశ్, మండల తిరుపతి, వరకృష్ణ, గణపతి పాల్గొన్నారు.

సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది టీచర్లు

ఆసిఫాబాద్‌రూరల్: సమాజాన్ని సన్మార్గంలో దిక్సూచిలా నడిపించేది ఉపాధ్యాయుడేనని జిల్లా విశ్రాంత్రి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్ణాగౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గురువులు నేర్పిన విద్యతోనే ఉన్నత స్థాయికి చేరామన్నారు. జైనూర్ కళాశాల అధ్యాపకులు సునీల్, టీచర్ తుకారాం, సంతోషిణిని, వినేశ్‌లను సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి లింగయ్య, సభ్యులు మధుసూదన్ గౌడ్, పద్మ, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కెరమెరి: గెలుచుకున్న లడ్డూతో భక్తులు


దహెగాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గణనాథుడికి వీడ్కోలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా గ్రామాల్లో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మండపాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎస్సై అనిల్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకునికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు. సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే పూజలు

సిర్పూర్(టి): వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో గల భజరంగ్‌దళ్ వినాయక మండపంలో వినాయకున్ని శుక్రవారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం వినాయక మండప కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వినాయక మండప కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గోలేటి, నంబాల తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో వినాయకుడికి స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. బ్యాండ్ మేళాల నడుమ వినాయకుడి శోభాయాత్ర జరిగింది. సీఐ సంజయ్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గంగాపూర్, గొందుగూడ వాగుల్లో నిమజ్జనం చేశారు.


దహెగాం: ఏటిగూడలో శోభాయాత్ర

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకుడితో పాటు ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను శుక్రవారం భక్తులు నిమజ్జన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కౌటాల: మండలంలోని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలం పాడారు. కౌటాల కౌండిన్య గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిమజ్జనంలో ప్రత్యేక నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సమీప చెరువులు, వాగుల్లో విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. బై బై గణేశా.. మళ్లీ రావయ్యా అంటూ గంగమ్మ ఒడిలోకి వదిలి వీడ్కోలు పలికారు. దీంతో గ్రామాల్లో భక్తుల సందడి నెలకొంది.


సిర్పూర్ (టి): హరీశ్‌బాబును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


కెరమెరిలో గణపతుల శోభాయాత్ర


కౌటాలలో..

కెరమెరి: మండలంలోని వివిధ వాడలకు చెందిన గణపతుల నిమజ్జనం కనుల పండువగా జరిగింది. మండల కేంద్రంలోని బెస్తవాడ, హనుమాన్ వాడ, నెహ్రూనగర్, విద్యానగర్, శివాలయం, చందూగూడ, సాకరాంగూడ, వివేకానంద కాలనీ, బెస్త కాలనీలకు చెందిన వినాయకుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణపతులను సుల్తాన్‌గూడలో, మరికొన్నింటిని సాంగ్వి పెద్దవాగులో నిమజ్జనం చేశారు.

రూ.50 వేలు పలికిన లడ్డూ

మండల కేంద్రంలో శివాలయం ఆవరణలోని గణపతి లడ్డూకు భారీ ధర పలికింది. శుక్రవారం వేలంలో మండల కేంద్రంలోని రాథోడ్ నూర్‌సింగ్ రూ. 50 వేలకు గణేశ్ లడ్డూను కైవసం చేసుకున్నారు. లడ్డూ కైవసం చేసుకున్న వారిని గ్రామ పటేల్ వాడై సోనేరావు దంపతులతో పాటు అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ సన్మానించారు. నెహ్రూనగర్‌లో గణపతి లడ్డూను రూ. 5700కు మంజుల –అనిల్ దంపతులు కైవసం చేసుకున్నారు.


కెరమెరి: భజన చేస్తున్న భక్తులు


రెబ్బెన: తలపాగాలతో మహిళలు

ముగిసిన యోగా శిక్షణ శిబిరం


విద్యార్థులతో యోగా చేయిస్తున్న శిక్షకులు

వాంకిడి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టల్‌లో గత మూడు రోజుల నుంచి ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు వడ్గూరే దొడ్డాజీ మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యత వివరించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి అష్టాంగ ప్రాణయమాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు నిత్యం యోగాసనాలు చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరిగి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని సూచించారు. హాస్టల్ వార్డెన్ మధుకర్, విద్యార్థులు పాల్గొన్నారు.